సీరియల్ కథ :

# ప్రేమ పుష్పాలు!



★

ర చ న :

శ్రీ బుద్ధిరాజు నరసింహారావు

(గతసంచిక తరువాయి)

చక్రవర్తి వీలు చూసుకుని అప్పుడప్పుడు చలపతిరావుగారింటికివెళ్ళి జయసుధకీ, ప్రభకీ పాఠాలుచెప్పి వస్తున్నాడు.

రోజులు గడిచినకొద్దీ అప్రయత్నంగానే చక్రవర్తీ జయసుధలు ఒకరివైపొకరు ఆకర్షింపబడ్డారు.

ఏదో అజ్ఞాతశక్తి వారిద్దరినీ దగ్గరకు తీసుకువచ్చింది.

సాత్వికంగా, నిరాడంబరంగా వుండే చక్రవర్తి వ్యక్తిత్వం జయసుధ హృదయంలో చోటు చేసుకుంది.

వారిద్దరూ సన్నిహితంగావుంటే వారిని ఒకకంట గమనిస్తూనే వున్నాడు చలపతిరావు.

ఆరాత్రి చలపతిరావుకి అసలు నిద్రపట్టలేదు.

ఎన్నెన్నో ప్రశ్నలు అతనిమెదడులో తిరుగుతూనే వున్నాయి.

జయసుధా చక్రవర్తీ ఒకరినొకరు నిజంగా ప్రేమించుకుంటున్నారా?

నిజంగా ప్రేమించుకుంటే చక్రవర్తి తల్లి దండ్రులతో మాట్లాడి త్వరగా పెళ్ళి నిశ్చయంచేసేస్తే మంచిదేమో!

కాని,...

చక్రవర్తి యింకా చదువుకుంటున్నాడాయె.

అయినా పర్వాలేదు. పెళ్ళయ్యాక అతని కెక్కడా జాబ్ దొరక్కపోయినా తను సేఠ్‌తోచెప్పి ఎక్కడైనా వేయించగలడు. జాబ్ చేస్తూ చదువుకోవచ్చు గదా?

ఆరాత్రి భార్యతోకూడా సలహా అడిగాడు చలపతిరావు.

'చూడండీ, ఈకాలంలో ప్రేమవ్యవహారాలు ఎక్కువకాలం సాగనీయకూడదు. యువతీ యువకుల ప్రేమ వ్యవహారాల్ని కనిపెట్టినవెంటనే త్వరలో ఉచితనిర్ణయం తీసుకోవడం మంచిది. లేకపోతే వారేదైనా తప్పటడుగు వేసేరో....వారితోపాటు మన పరువు ప్రతిష్ఠలకే ముప్పు రావచ్చు. అందులోనూ మనం ఆడబిడ్డగలవాళ్ళం!

'అదే సీతా, నేనూ అనుకునేది. రేపే అమ్మాయిని అడుగుతాను. తనకి చక్రవర్తి అంటే యిష్టమేవా అని. అలాగైతే మనం మంచిరోజు చూసుకుని వాళ్ళింటికి వెళ్దాం.' చలపతిరావు ఒక నిశ్చయానికి వచ్చినట్లు అన్నాడు.

ఆ రెండో రోజే.

జయసుధ డాబామీద చదువుకుంటున్నప్పుడు చలపతి రావు అక్కడికి వెళ్ళాడు.

'రానాన్నా. ఆఫీసుకి టైం అవుతున్నట్లుందే.'

'పర్వాలేదమ్మా, ఈరోజు కాస్త లేటుగా వస్తానని పేర్‌కి చెప్పాను.'

ఆయన వాలుకుర్చీలో కూర్చుని హాయిగా ఊపిరి పీల్చాడు.

జయసుధ నోట్సు రాసుకోవడంలో లీనమైపోయింది.

'నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలని వచ్చా నమ్మా.'

'ఏమిటి నాన్నా.' అంది తలెత్తుతూ జయసుధ.

'చూడమ్మా, యిలాంటివిషయాలలో సిగ్గుపడకుండా, బాగా ఆలోచించి ఒక నిశ్చయానికి రావాలి. రెండు జీవితాలు ఏకమై, ఒకరి నొకరు అర్థం చేసుకుని జీవితాన్ని అందమైన పూలబాటగా మార్చుకోవాలి. అందుకే నేనడిగే ప్రశ్నకి బాగా ఆలోచించుకుని సమాధానం చెప్తావుకదూ?'

ఆయన అడుగబోయేప్రశ్న ఏమైవుంటుందో పసిగట్టిన జయసుధ మౌనంగా ఊరుకుంది.

చలపతిరావు కొద్దిక్షణాలు తదేకంగా ఆమెనే చూస్తూ, 'నీకు చక్రవర్తి అంటే మనస్ఫూర్తిగా యిష్టమేనా జయా?' అనడిగేడు.

సిగ్గుతో తల దించుకుంది జయసుధ.

'చెప్పమ్మా,'

అతికష్టంమీద ఎలాగో, 'ఇష్టమే నాన్నా.' అని వెంటనే లేచింది;

'అలా అయితే, అతని యింటిఎడ్రస్ కనుక్కొని నాకు తెలియజేయి. మంచిరోజు చూసుకుని వాళ్ళని కలుస్తాను' అని లేచాడు చలపతిరావు.

మారు మాట్లాడకుండా మళ్ళీ కూర్చుని రాసుకోవడంతో లీనమైంది జయసుధ.

* * *

ఆకాశంలో మబ్బులను తొలగించి పౌర్ణమి చంద్రుడు చిరునవ్వులు చిందిస్తున్నాడు.

సాయంత్రం ఏడు దాటింది.

మిలాప్‌లో చెట్లచాటుగా ఎన్నో జంటలు!

వీస్తున్న చక్కటిగాలికి, ప్రశాంతమైన మిలాప్ వాతావరణం వారిహృదయాలకి అంతులేని ఆనందాన్ని తెచ్చి పెడుతోంది.

'లేక్'కి కుడిప్రక్కగా, ఏకాంతంగావున్న కొబ్బరిచెట్ల చాటుగా ఒక జంట!

చక్రవర్తీ జయసుధల జంట!

జయసుధ ఒడిలో తలపెట్టుకుని పడుకుని ప్రకృతిసౌందర్యాన్ని తిలకిస్తున్నాడు చక్రవర్తి.

'జయా, ఆ చందమామని చూసావా ఎంత చక్కగా వున్నాడో!'

'అచ్చు నీలాగే!'

'నాలాగా, అబద్ధం. అతనిసౌందర్యం అతనిదే. అతని సౌందర్యంతో ఒక్క నీ సౌందర్యమే పోటీ పడగలదు!' చక్రవర్తి వీస్తున్నగాలికి ఆమె ముఖంమీదపడ్డ ముంగురులను సవరిస్తూ అన్నాడు.

'చాలు-చాలు పొగడ్తలకేంగాని.'

'నిజం జయా. నేను నిన్ను పొందగలిగేనంటే అది నా అదృష్టమే! ఆనాడు, అంటే నీవు నన్ను వెళ్ళగొట్టిన రోజున నిజంగా నిరాశ చెందాను. జీవితాంతం నిన్ను పొందలేననుకున్నాను. కాని దైవనిర్ణయం ఎప్పు డెలా వుంటుందో చెప్పలేం కదా. చివరికి నీ చల్లని మదిలో ఎలాగైతేనేం, చోటు చేసుకోగలిగేను. అంతకన్నా నాకు వేరే కావలసిన దేమిటి?'

'చక్రవర్తీ, చెప్పాలంటే, నేనే అదృష్టవంతురాల్ని. లేకపోతే నీ అంతటి ఉత్తముణ్ణి నేను పొందగలనా?' జయసుధ అతని కాలర్ సవరిస్తూ మృదువుగా అంది.

చక్రవర్తి తనవ్రేళ్ళతో ఆమె కుడిచేతివ్రేలికున్న ఉంగరాన్ని సవరిస్తూ, 'సరేలే, యిద్దరం అదృష్టవంతులమే అని సరిపెట్టుకుందాం జయా. మనహృదయాలలో నాటుకున్న ఈ ప్రేమలత ఎన్నడూ వాడిపోకూడదు. చిగిర్చి పూలు పూయాలి. వికసించిన ప్రేమపుష్పాలు, ఆ పుష్పాలు జీవితాంతం మన హృదయాలలో సుగంధాలు విరజిమ్ముతూ వుండాలి, శాశ్వతంగా! అన్నట్లు, పాపం ప్రేమకుమార్ యిప్పుడెలా వున్నాడో.'

'షో, నీతో నేనసలు మాట్లాడేమాట్లాడను.'

జయసుధ లేవబోయింది. వెంటనే చక్రవర్తి చేయి జాసి ఆమెచేయిపట్టుకుని కూర్చోబెట్టాడు.

'ఆహా. అమ్మాయిగార్కి యింతకోపముందని నాకు తెలియదే, శాంతించవలెను, ఆం! యిందాకట వస్తున్నప్పుడు నేను ఆనందంతో ఎగిరి గెంతేసే శుభవార్త ఏదో చెప్తానన్నావు. ఏమిటవి?' అన్నాడు చక్రవర్తి మాట మారుస్తూ.

'నే చెప్పను షో!'

బుంగమూతిపెట్టి ఎక్కడలేనికోపం ప్రదర్శించింది జయసుధ,

'అబ్బ, చెప్పవూ. మామంచి జయవు కదూ. అబ్బో! ఆ కోపంలోకూడా ఎంత చక్కగా వున్నావో. నిజంగా పౌర్ణమి చంద్రుడిలో ఆకాశ మున్నట్లుంది!'

జయసుధ నవ్వాపుకోలేకపోయింది.

పకపక నవ్వుతూ, 'అబ్బాయిగార్కి కవిత్వంతో మెదడు అరిగిపోయినట్లుంది. చంద్రుడిలో ఆకాశంకాదు. ఆకాశంలో చంద్రుడిలా;'

'ఓహో. అందమైన నీ ముఖారవిందం తిలకిస్తూ, మైమరచిపోతూవుంటే. అది సరే కాని, ఆ శుభవార్తేమెటో చెప్పిపారెద్దూ. నువ్వూ, నీ సస్పెన్సూ. నన్ను చంపక!' అమెను దగ్గరగా తీసుకుంటూ అన్నాడు చక్రవర్తి.

'ముఖ్యవిషయ మేమిటంటే, నాన్నగారు మీ యింటి ఎడ్రస్ కనుక్కొని రమ్మన్నారు. నాన్నగారు మంచిరోజు చూసి మీయింటికివెళ్ళి మీవాళ్ళతో మాట్లాడుతారుట.'

'అమ్మ, బాబాయి. అప్పుడే. నాకసలు పనీలేదు, పాటూ లేదు. అసలు చదువే పూర్తికాలేదు.'

'నాన్నగారు నీవు అంగీకరిస్తే జాబ్ యిప్పించే ప్రయత్నం చేస్తానన్నారు. చదువు ప్రయివేటుగా చదువుకో వచ్చుట. ఆయన ఉద్దేశమేమిటంటే, ఈకాలంలో మంచి జాబ్ దొరికితే తలదూర్చడమే మంచిది. లేకపోతే బాగా చదువుకుని నౌకరీకి అర్హత సంపాదించినప్పటికీ ఉద్యోగమే దొరక్కపోవచ్చు కదా!'




ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్

# - జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెశర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును. ¾ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

వివరములకు

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works : 22757

**THE EL-P-EM INDUSTRIALS**

393, Mettupalaym Road, (P.B. No. 1053) COIMBATORE-641 002

**SALES BRANCHES :–**

**112, Zeera, Secunderabad - 3.**

**13/85, Jayachamarajendra Road, Bangalore - 2.**

**10, Municipal Market Building, Kokkalai, Trichur - 1.**

'అదిమాత్రం నిజమే అనుకో, కాని.'

'కానీలేదు, గినీలేదు. ఎడ్రస్ చెప్పు.'

ఎడ్రస్ చెప్పాడు చక్రవర్తి.

'మరి వెళ్దాం. చాలా టైం అయిపోయింది,'

'కూర్చో జయా. అసలు నిన్నొదిలి క్షణంకూడా వుండలేకపోతున్నాను!'

'ఆ మూడుముళ్ళూ పడ్డాక చక్కగా, ముచ్చటగా గంటలుతరబడి కబుర్లు చెప్పుకుందాం, సరేనా?' అంటూ జయసుధ లేచి నిల్చుంది.

'మరి నే చెప్పబోయే శుభవార్త వినవా?'

'ఏమిటది, త్వరగా చెప్పుమరి.'

'ముందు కూర్చుంటేనే చెప్పేది.'

'అబ్బబ్బ. ఊ. కూర్చున్నా. యిక చెప్పు.'

ఆమె భుజంమీద చేయివేసి, 'మద్రాసు ఆర్టు గాలరీకి పంపిన నా చిత్రానికి. అంటే నేవేసిన పెయింటింగ్‌కి ప్రథమ బహుమతి వచ్చింది.'

'ఏమిటీ, నీవు చిత్రాలుకూడా వేస్తావా?'

'ఏం. అనుమానమా? పత్రికల్లో 'ప్రేమ్' అనే పేరుతో వెలువడేబొమ్మలు నీవు చూసేవుంటావు. అవి నేను వేసినవే.'

జయసుధ గుండె అదిరిపడింది.

'ఏమిటీ. 'ప్రేమ్' అనేపేరుతో చిత్రాలు వేసేది నువ్వా. మరి ప్రేమ్‌కుమార్ అవి తనే వేసినవని గొప్పగా చెప్పకున్నాడే?'

'కొందరికి అలాంటి గొప్పలు చెప్పుకోవడం అలవాటు. నాకు గొప్పలు చెప్పుకునే అవసరం లేదు. మనలో ప్రతిభ అనేది వుంటే ఏనాడో ఒకనాడు మనం తప్పక గుర్తింప బడతాము.' అన్నాడు ముక్తసరిగా చక్రవర్తి.

జయసుధకి ఆక్షణంలో ప్రేమ్‌కుమార్ అంటె అంతు లేని అసహ్యం వేసింది. నిజంగా ఆ చిత్రకారుడు చక్రవర్తేనని తెలిసి సంతోషంతో పొంగిపోయింది. మైమరచి పోయింది.

'అబ్బో, దేవిగారు ఎక్కడో విహరిస్తున్నట్లున్నారు!'

చక్రవర్తిమాటకి ఆమె తేరుకుని, 'ఓహ్. కంగ్రాచ్యులేషన్స్ చక్రవర్తీ.'

'ఓ. కె. రా వెళదాము' అంటూ లేచాడు.

అతను అందించిన చేయిపట్టుకుని జయసుధకూడా లేచింది.

ఇద్దరూ మిలాప్‌నుంచి బైట పడ్డారు.

* * *

కో-ఆపరేటివ్ బేంక్ కెదురుగావున్న యింటిముందు రిక్షా దిగారు చలపతిరావు దంపతులు.

ఆకాశం మబ్బులతో నిండివుండడంవల్ల త్వరగానే సంధ్యా చీకటి అలుముకుంది.

రోడ్డుకి రెండువైపులావున్న విద్యుద్దీపాలు వెలిగాయి.

ఆ పెంకుటిల్లు ద్వారబంధానికి 'భాస్కరరావు, బి. ఏ.' అన్నబోర్డు స్పష్టంగా కనబడింది చలపతిరావుకి.

'ఈ యిల్లేనే సీతా, చక్రవర్తి తండ్రిపేరు భాస్కరరావు.' రిక్షావాడికి డబ్బులిస్తూ అన్నాడు చలపతిరావు.

రిక్షావాడు ముందుకి కదలగానే యిద్దరూ యింటి వరండా ఎక్కారు.

చలపతిరావు తలుపుగొళ్ళెం శబ్దం చేసాడు.

'ఎవరది, వస్తున్నా!' లోపలినుంచి మగకంఠం.

'భాస్కరరావుగారి కంఠమనుకుంటా.' అని భార్యతో మెల్లిగా అన్నాడు చలపతిరావు.

కొద్దిక్షణాలకి తలుపు తెరుచుకుంది.

బట్టతలతో, తెల్లబడినమీసాలతో ఓ యాభై సంవత్సరాల పురుషుడు కనబడ్డాడు.

'ఎవరు కావాలండీ.' వినయంగా అడిగాడతను.

'భాస్కరరావుగారు.'

'ఆఁ. నేనే. రండి. రండి.'

భాస్కరరావు వారిని సాదరంగా ఆహ్వానిస్తూ, ప్రక్కకి తొలిగాడు.

ఆగది చాలా చిన్నది.

ఒకవేపు బల్లా, బల్లపైన అందమైన వరుపూ దుప్పటీ.

రెండోప్రక్కని ఓ నాల్గు ఫోల్డింగ్ కుర్చీలు.

గదిమూలకి అద్దాలబీర్వాలో పుస్తకాలూ, పత్రికలూ.

'కూర్చోండి!' కుర్చీలు వారివైపు జరుపుతూ అన్నాడు భాస్కరరావు.

దంపతులిద్దరూ ఆశీనులయ్యారు.

'బాబు చక్రవర్తి లేడా?'

చలపతిరావు ప్రశ్నకి బదులుచెప్తూ భాస్కరరావు, 'సుమారు రెండునెలలకిపైగా అయింది. మా ఆవిడఒంట్లో అసలు బాగుండంలేదండి. దానికేం జబ్బోగాని అసలు వదలడమేలేదు. ఇప్పుడే బాబు డాక్టర్ 'శశి'గారి క్లినిక్‌కి తీసుకునివెళ్ళాడు' అన్నాడు.

'అయ్యో, ఎంతమాట. మద్రాసయినా, వైజాగయినా తీసుకెళ్ళి చూపించలేకపోయారా?'

'వెళ్దామనే వుంది. కాని, ఎప్పటికప్పుడే సరిపోతోంది. మంచిడాక్టర్లకి చూపిద్దామంటే బాగా డబ్బు కావాలికదండి. ఈకాలంలో ఆహారపదార్థాలవలె డాక్టర్ ఫీజులుకూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఏం చెయ్యమంటారు చెప్పండి ? భాస్కరరావు దగ్గుతూ అన్నాడు.

'అది సరేలెండి. మాటలమధ్యలో అసలు పరిచయం చేసుకోవడమే మరిచాను. నాపేరు చలపతిరావు. నేను సేఠ్ రామ్‌లాల్‌వద్ద గుమాస్తాగా పని చేస్తున్నాను.

'మంచిదండి !'

సీత ఏం తోచక అటూ యిటూ చూస్తోంది.

'ఇంతకీ మీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడ్డానికని వచ్చాను.

చలపతిరావు గొంతు సవరించుకుని అతనివైపు చూసాడు.

'శెలవియ్యండి.'

భాస్కరరావు కుర్చీకి సరిగ్గా ఆనుకుని కూర్చున్నాడు.

ఎలా ప్రారంభిద్దామా అని కొద్దిక్షణాలు చలపతిరావు తటపటాయించాడు.

అది గమనించి సీత అందుకుంది—

'చూడండీ. మీఅబ్బాయి చక్రవర్తి మాపిల్లలకి పాఠాలు చెప్పడానికి వస్తూవుంటాడు.

'ఓహో అలాగా!' భాస్కరరావు కంఠం.

ప్రారంభించడానికి వాక్యాలు దొరికినట్లు చలపతిరావు భార్య వైపోసారి కృతజ్ఞతగాచూసి, 'అయితే యింకో విషయమేమిటంటే, మీ అబ్బాయీ, మా అమ్మాయి జయ సుధా ఒకే కాలేజీలో చదువుకుంటున్నారు.'

'వెరీగుడ్ !'

బాస్కరరావు అర్థమైనట్లు నవ్వాడు.



ఎల్లప్పుడూ - మాచే తయారుచేయబడిన

♦ పాప్‌లిన్ ♦ విజయ్ ♦ సిల్వర్
♦ అనిన్ ♦ బాబి ♦ రోలెక్స్

బనియన్లనే వాడండి. అవి బనియన్లకెల్లా అత్యుత్తమమైనది.

**MEXICO KNITTING MILLS**
**43-A, Cauvery St—TIRUPUR - 638602**

'అంతేకాదు. చూడండీ, ఈకాలంలో పిల్లల్ని అసలు నమ్మలేం. ఏదో ప్రేమా ప్రేమా అని ఒకటే వేధిం చేస్తారు. అసలు మనం దొంగచాటున జరిగే వాళ్ళ వ్యవహారం తెలుసుకోగానే ఆ మూడుముళ్ళూ వేసేస్తేనే మంచిదని నాఅభిప్రాయం. లేకపోతే ఏ అఘాయిత్యానికైనా దారితీయవచ్చు. మీరేమంటారు?

'అది నిజమే సుమండి!'

'వారిద్దరూ క్లోజ్‌గావుంటే నాకనుమానం వచ్చింది. మా అమ్మాయితో అసలువిషయ మడిగితెలుసుకున్నాను. ఇక మీరు అంగీకరించి వారిని ఆశీర్వదిస్తే మీఋణం జన్మజన్మాలకీ మరచిపోలేను,'

అంతా విని భాస్కరరావు ఆలోచనలో పడ్డాడు.

'కాని, బాబు చదువు యింకా పూర్తికాలేదు కదండీ!'

'అది సరేలెండి. బి.ఏ. కదా, ప్రయివేటుగానైనా చదువుకోవచ్చు. మహారాజావారి ఎకాడమీలో మంచి ఉద్యోగం ఒకటుంది చక్రవర్తి యోగ్యుడు. నేను ప్రయత్నంచేసి ఆ ఉద్యోగం యిప్పించగలను. చూడండీ, ప్రతీపురుషుడికీ ఏదో ఉద్యోగం తప్పక ఉండాలికదా? ఈరోజుల్లో బాగా చదువుకుని సర్టిఫికేట్లు సంపాదించినవారికే ఉద్యోగాలు లేవు. అలాంటిది, మంచిఅవకాశం దొరికినప్పుడు చేజిక్కించుకోవడమే మేలని నా అభిప్రాయం. మరి మీ అభిప్రాయంకూడా కావాలిగదా?' అని చలపతిరావు ఆశగా అతనివైపు చూసాడు.

'మీ అభిప్రాయంతో తప్పక నే నేకీభవిస్తాను. అబ్బాయీ అమ్మాయీ ఒకరి నొకరు మెచ్చుకున్నప్పుడు అడ్డుపడి వారిని వేరుచెయ్యడం మానవధర్మం కాదు. ఆ మూడుముళ్ళూ వేయించి ఆశీర్వదించడమే మేలు. అయితే మా శ్రీమతి అంగీకారంకూడా కావాలిగదా?' అన్నాడు భాస్కరరావు.

భార్య సీత సంతోషం పట్టలేకపోయింది.

చలపతిరావు వదనం వికసించింది.

'తప్పక తెలుసుకోండి. కాని, నాదో చిన్నమనవి. అపార్థం చేసుకోకండి. కట్నం.'

'చూడండి చలపతిరావుగారూ, నాకలాంటి ఆశలేం లేవు. కట్నాలూ, కానుకలూ ఏమైనా యివ్వాలనుంటే మీ అమ్మాయికే యివ్వండి. ఇంకోవిషయం పెళ్ళి జరిగినా ఎక్కువ ఖర్చులేకుండా, హడావిడి లేకుండా రిజిష్ట్రార్ ఆఫీసులో జరిపించేస్తేనే చక్కగా వుంటుంది.'

'అంతా మీయిష్టప్రకారం జరుగుతుంది.'

అంతలో యింటిముందు రిక్షా ఆగింది.

'అదుగో మా ఆవిడ రానే వచ్చింది!' భాస్కరరావు ద్వారబంధంవైపు చూస్తూ అన్నాడు.

(సశేషం,)

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితం. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులుకాదు.

—సంపాదకుడు.